క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్‌లైన్‌ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం మొగల్రాజపురం సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, వీఎంసీ వాటర్ ప్లాంట్, వెటర్నరీ హాస్పిటల్, రమేష్ హాస్పిటల్ ఏరియా, బందరు రోడ్డు, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



కృష్ణలంక(విజయవాడతూర్పు): హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని గైడ్ సంస్థ మేనేజర్ కె.సుజాత అన్నారు. రాణిగారితోట, తారకరామనగర్‌లో ఏపీ హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు గైడ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై 'మీకు తెలుసా..' అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది? ఎలా వ్యాపించదు? రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్న చూపు లేకుండా సమాజంలో ఎలా జీవించాలో వివరించారు.

9 మంది ఉద్యోగాలకు ఎంపిక



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 9 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని జిల్లా ఉపాధికల్పనాధికారి విక్టర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా గురువారం జరిగింది. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 54 మంది యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారు. కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేసి ఉద్యోగాలకు ఎంపిక చేశారు.

సంస్కృత భాషాధ్యయనం అవసరం



మాట్లాడుతున్న గాయత్రి

పటమట(విజయవాడ తూర్పు): పటమట స్టెల్లా కళాశాల సంస్కృత భాషా విభాగం ఆధ్వర్యంలో సంస్కృత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయుర్వేద వైద్యురాలు, కళాశాల పూర్వ విద్యార్థిని డాక్టర్ పి. గాయత్రీదేవి యోగ, ఆయుర్వేదాల పరిజ్ఞానానికి సంస్కృత భాషాధ్యయనం ఎంత అవసరమో వివరించారు. సంస్కృత వ్యాకరణ కర్త పాణిని ప్రతిభను కొనియాడారు. ఈ సందర్భంగా సంస్కృతీకరించిన నేటి చలనచిత్ర గీతాలకు విద్యార్థినుల కృత్యాభినయం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంస్కృత విభాగాధిపతి డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ మంగాదేవి, హారిక, డాక్టర్ శ్రీనివాసరావు, రజని విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాటి నివారణకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. కృష్ణలంక ప్రాంతంలో ఐదో ట్రాఫిక్-1 సెక్టార్ ఏరియాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను ఐదో ట్రాఫిక్ సీఐ బి.బాలమురళీకృష్ణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఎన్‌హెచ్ఏఐ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. జాతీయ రహదారిపై స్క్యూబ్రిడ్జి, గీతానగర్ కట్ట, నేతాజీ బ్రిడ్జి, వారధి చెక్‌పోస్టు తదితర ప్రాంతాలను ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు సీసీ కెమెరాలు, రంబుల్ స్ట్రిప్స్, జీబ్రా క్రాసింగ్స్, కాట్ ఐస్ రోడ్డు స్టడ్స్, బ్లింకర్స్, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ ఏర్పాటు చేయాలని, అలాగే వారధి ఫిట్‌పాత్‌లపైకి వాహనాల ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

మహిళలపై అఘాయిత్యాలను ఖండించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు



క్యాండిల్ ర్యాలీ చేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళలపై అఘాయిత్యాలను సమాజంలోని అందరూ ఖండించాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధర్ అన్నారు. ఆ కళాశాలలోని రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో కోల్‌కతాలోని వైద్య విద్యార్థిని హత్యకు నిరసనగా, మహిళలపై దాడులను ఖండిస్తూ ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో మహిళలపై జరిగే దాడులను ఖండించాలన్నారు. తమ చుట్టూ ఉన్న సమాజంలో ఈ విధమైన దాడులు జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అర్షిత్ భరద్వాజ్, అచ్యుత, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో..

మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని శానిటరీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు కోల్‌కతా సంఘటనకు నిరసనగా క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ సామూహిక హత్యాచార ఘటనను దేశవ్యాప్తంగా ప్రజలందరూ స్పందిస్తున్నా, కేంద్రంలో రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వాలు, నేతలు మౌనంగా ఉండడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు జి. వెంకట్రావు, యూనియన్ కార్యదర్శి వి. సాంబులు నాయకులు నరసింహారావు, ఆదిలక్ష్మి, దుర్గ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న పీవీపీ విద్యార్థులు

ఆడపిల్లలపై అకృత్యాలు ఆగాలి

పటమట(విజయవాడతూర్పు): ఆడపిల్లలు, మహిళలపై క్రూరంగా జరుగుతున్న అకృత్యాలను నిరోధించగలిగిననాడే భారత సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని విద్యార్థి నాయకులు అన్నారు. కోల్‌కతాలోని ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ వైద్యురాలిపై సామూహిక అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం పటమట ఫన్‌టైం క్లబ్ రోడ్డులో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సమాజం అవమానకరమైన రీతిలో ప్రవర్తించి, హత్య చేసిన వారిని ప్రభుత్వాలు వదలకుండా కేసు విచారణ వేగవంతం చేసి శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మరింత కఠినమైన చట్టాలు చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థి నాయకులు పి. పవన్ కుమార్, లోకేశ్వర్, అఖిల్, నితీషా, ఎం గాయత్రి, కె. గాయత్రి, బొర్రా దిలీప్, అట్లూరి సుమ విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం

జలమయమైన పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు



బెంజిసర్కిల్ వద్ద వర్షపు నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు



గత కొన్ని రోజులుగా వేసవిని తలపించిన వాతావరణం గురువారం మధ్యాహ్నం నుంచి చల్లబడింది. సాయంత్రానికి వర్షం మొదలై.. కుండపోతగా కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్ జాం అయ్యింది. అయితే వరుణుడి రాకతో ప్రజలు ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం పొందారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి



స్వామి వారికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో గురువారం గణపతికి విశేష అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం గణపతి స్వామికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గణపతి మంత్ర హవనం(హోమం)ను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులకు, ఉభయ దాతలకు వేద ఆశీర్వచనం, ప్రసాదాలను అందజేసి ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తికి గురువారం విశేషంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారి విగ్రహానికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారికి పలువురు భక్తులు తమ నామ గోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. స్వామి వారికి నిర్వహించిన పంచామృత అభిషేకాలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరాగా, కార్యక్రమం అనంతరం వారికి ఆలయ అర్చకులు ప్రసాదాలను పంపిణీ చేశారు.

రిటైర్డ్ ఇంజినీర్ సీతారామయ్య కన్నుమూత



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సంస్థ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ సూరపనేని సీతారామయ్య (86) గురువారం ఉదయం కన్నుమూశారు. ఈయన కంకిపాడు మండలం, మారేడుమాక గ్రామంలో కేశవనారాయణ, సరస్వతమ్మకు 1939లో జన్మించారు. ఈయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. బెంగళూరులో బీఈ ఎలక్ట్రికల్ చదివారు. నార్ల తాతారావు వంటి ప్రముఖులతో కలిసి సీతారామయ్య పనిచేశారు. విజయవాడ థర్మల్ కేంద్రం 4, 5 యూనిట్లను 18 నెలల కాలంలో పూర్తి చేశారు. రిటైరైన తరువాత కూడా దేశంలోని వివిధ కంపెనీల్లో సీతారామయ్య 75 ఏళ్లు వచ్చే వరకు నిర్విరామంగా విధులు నిర్వర్తించారు. కొండపల్లి లాంకో పవర్ స్టేషన్, నాగపూర్‌లోని పవర్ ప్లాంట్, రాజస్థాన్‌లోని సూరత్ ప్లాంటు, పానిపట్ పవర్ ప్లాంట్ మొదలైన ప్రాజెక్టుల్లో ఈయన పనిచేశారు. ఈ ఏడాది జూన్‌లో మారేడుమాకలో 33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి సోదరుడైన డాక్టర్ రామబ్రహ్మంతో కలసి సీతారామయ్య భూమిని దానంగా ఇచ్చారు. గురునానక్ కాలనీలోని డాన్‌బాస్కో స్కూల్ ఆవరణలో సీతారామయ్య భౌతికకాయాన్ని ఉంచారు. అంత్యక్రియలు శనివారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

రేపు జయహో జానపదం

విజయవాడ కల్చరల్: అంతర్జాతీయ జానపద దినోత్సవం సందర్భంగా శనివారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో దామోదరం జానపదం, దేశికా ఆర్ట్స్, మామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జానపద వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ దామోదర గణపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జానపద గీతాలు, నృత్యాలు, వివిధ రంగాల్లోని కళా ప్రముఖులకు కృష్ణవేణి, కళా కవితా సేవా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

కిడ్నీ బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు ప్రాంతంలో కిడ్నీ బాధితుల సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ. కొండూరు, గంపలగూడెం, తిరువూరు, విసన్నపేట, మైలవరం తదితర మండలాల పరిధిలోని గ్రామాల్లో కిడ్నీ వ్యాధితో వందల మంది పిట్టల్లా రాలిపోతున్నారన్నారు. ఈ ప్రాంతం మరో ఉద్దానంలా తయారవుతోందన్నారు. దీని బారి నుంచి భవిష్యత్ తరాలను కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణం అఖిలపక్ష కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్దానం తర్వాత అత్యధికంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఏ.కొండూరు మండలంలోనే ఉన్నారన్నారు. ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో లభించే నీటిలో సిలికాన్, ఫ్లోరైడ్ పరిమాణం ప్రమాదకర స్థాయిలో ఉందన్నారు.

కిడ్నీ ఆసుపత్రి వెంటనే నిర్మించాలని, శుద్ధి చేసిన కృష్ణానీటిని కుళాయిల ద్వారా ఇంటింటికీ అందించాలని, కిడ్నీ బాధితులకు రూ. 5 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోసం తమ పార్టీ బాధితుల పక్షాన 24వ తేదీ శనివారం మండల కేంద్రం ఏ. కొండూరులో ధర్నా నిర్వహిస్తామన్నారు. సమస్య తీవ్రతపై అధికారులకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. వ్యాధిగ్రస్తులకు, డయాలసిస్ పేషెంట్లకు ఉచితంగా అన్ని రకాల మందులు పంపిణీ చేయాలన్నారు. డయాలసిస్ పేషెంట్లకు ఇస్తున్న పెన్షన్‌ను రూ. 20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు, కళ్యాణ్, ఎస్‌కే హెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుళాయి సర్వేను సత్వరమే పూర్తి చేయండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



బందరు రోడ్డుపై పరిస్థితిని పరిశీలిస్తున్న కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి సర్వేను విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని అసెస్మెంట్లలో సత్వరమే పూర్తిచేసి తనకు నివేదించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన కుళాయి సర్వేపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయం సెక్రటరీలు సర్వేను వేగవంతం చేయాలన్నారు. సర్వేలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా కచ్చితమైన డేటాను నమోదు చేయాలన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 2,33,131 అసెస్మెంట్లకు గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు 1,86,638 అసెస్మెంట్ల సర్వే పూర్తయిందని, దాదాపు 80 శాతం సర్వేని పూర్తి చేశారని, మిగిలిన 20 శాతం కూడా వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సర్కిల్లో ఈ సర్వేను వేగవంతం చేసేందుకు జోనల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ, ఇంజినీరింగ్, అధికారుల సహకారంతో పూర్తిచేయాలని ఆదేశించారు.

రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు

పటమట(విజయవాడతూర్పు): రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా, ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ నిరంతరం చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం వన్ టౌన్, కెనాల్ రోడ్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ప్రజలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వెంటనే రోడ్లపై ఉన్న వర్షపు నీటి నిల్వలను తొలగించాలని, నిరంతరం సైడ్ డ్రెయిన్లలో పూడికలు తీస్తూ వర్షపు నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పి.రత్నావళి, చీఫ్ ఇంజినీర్ ఇన్‌చార్జ్ శ్రీరామచంద్రమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్ ఈ పర్యటనలో కమిషనర్ వెంట ఉన్నారు.

సైన్స్‌పై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలి

సిద్ధార్థ స్కూల్‌లో నేషనల్ సైన్స్ డే వేడుకలు



చంద్రయాన్-3 గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న శ్రీకుమార్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆంధ్రా లయోలా కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకుడు తుమ్మల శ్రీకుమార్ చెప్పారు. వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో జాతీయ అంతరిక్ష రోజు (నేషనల్ సైన్స్ డే) గురువారం నిర్వహించారు. తుమ్మల శ్రీకుమార్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మన జీవన విధానంలో సైన్స్ ఎన్నో మార్పులు తీసుకువచ్చిందన్నారు. మనం నిత్యం ఉపయోగించే ప్రతి వస్తువులోనూ సైన్స్ దాగి ఉందన్నారు. ప్రశ్న ద్వారానే సైన్స్ మొదలై ఎన్నో నూతన ఆవిష్కరణలు దారితీస్తుందని చెప్పారు. చంద్రయాన్-3 ప్రాజెక్టు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు శ్రీకుమార్ వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. సీతారామయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ మొబైల్ ఫోన్‌కు బానిసలు కాకుండా చక్కగా చదువుకుని భవిష్యత్తులో దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా విద్యార్థులు ఎదగాలని చెప్పారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు జి.శ్రీనివాసుతో పాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఫౌండ్రీ డే వేడుకలు



మాట్లాడుతున్న భవానీ కాస్టింగ్ అధినేత శశి

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్థానిక ఏపీ ఎంఎస్ఎంఈ అసోసియేషన్ హాలులో గురువారం 75వ నేషనల్ ఫౌండ్రీ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏపీఎంఎస్ఎంఈ గౌరవాధ్యక్షుడు బాయన వెంకట్రావు మాట్లాడుతూ మొదటి ఫౌండ్రీ పరిశ్రమను 1949లో కోల్‌కతాలో ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దశల వారీగా అభివృద్ధి జరుగుతూ వచ్చిందన్నారు. మన ఆటోనగర్‌లో కూడా చాలా ఫౌండ్రీలు ఏర్పాటయ్యాయన్నారు. కాకినాడ భవానీ కాస్టింగ్ అధినేత శశి మాట్లాడుతూ పరిశ్రమల్లో అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకునే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు జిల్లా పరిశ్రమలశాఖ జీఎం సుధాకర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఏపీ చాప్టర్ అధ్యక్షుడు టి. పార్థసారథి, కార్యదర్శి రామచంద్రరావు, అన్నె శివనాగేశ్వరరావు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఫెడరేషన్ జనరల్ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

మొహమ్మద్ ఖాన్ జ్యూయలర్స్ షోరూం ప్రారంభం



షోరూంలోని ఆభరణాలు చూపుతున్న సంస్థ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నమ్మకం, నాణ్యతకు పేరుగాంచిన మొహమ్మద్ ఖాన్ డైమండ్ – జ్యూయలర్స్ నూతన షోరూమ్‌ను విజయవాడ బందరు రోడ్డులోని రాఘవయ్య పార్కు ఎదురుగా గురువారం ఘనంగా ప్రారంభించినట్టు సంస్థ మేనేజింగ్ పార్టనర్ ఇర్ఫాన్ ఖాన్ తెలిపారు. ప్రారంభం సందర్భంగా కొనుగోలుదారులకు పలు ఆఫర్లు అందిస్తున్నట్లు తెలిపారు. బంగారు ఆభరణాలపై ఒక గ్రాముకు రూ. 300, వజ్రాభరణాలపై రూ. 15 వేల వరకు తగ్గింపు ధరలకు అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రత్యేకంగా తయారు చేయించిన లైట్ వెయిట్ బంగారు ఆభరణాలు, అధునాతన డిజైన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. బంగారు, వజ్రాభరణాలతో పాటుగా వెండి ఆభరణాలను విక్రయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మొహమ్మద్ ఖాన్ డైమండ్, జ్యూయలర్స్ పార్టనర్ ఫజలుల్లా రహమాన్ ఖాన్, కేఎం మునీరుద్దీన్, మేనేజర్ బీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థి సత్తా



నితీష్ నాగసాయిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ రమేష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): హరియానాలోని దేవిలాల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 16 నుంచి 18 తేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్-2024 పోటీల్లో తమ కళాశాల ఇంటర్ విద్యార్థి పి.నితీష్ నాగసాయి ప్రథమ బహుమతి పొందాడని శారదా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న కళాశాల ఆవరణలో నితీష్ నాగసాయిని అభినందించే కార్యక్రమం గురువారం జరిగింది. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో కూడా ప్రతిభ చూపుతున్నారని రమేష్ బాబు అన్నారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి మాట్లాడుతూ ఇకపై జరిగే పోటీల్లో కూడా నితీష్ నాగసాయి మరిన్ని బహుమతులను గెలుచుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, కళాశాల జనరల్ మేనేజర్ జీవీ రావు మాట్లాడుతూ ఆటలతో మానసిక, శారీరక ఆరోగ్యం పొందవచ్చని అందువల్ల తమ కళాశాలలో విద్యతో పాటుగా క్రీడలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ప్రతిభ చూపిన పి.నితీష్ నాగ సాయిని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

దోమల దండయాత్రకు తెర



నగరంలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ఈడా ఉంటా.. ఆడా ఉంటా అంటూ ఇంటి బయట, లోపల, సెంటర్లో, రోడ్డుపై ఇలా అన్ని చోట్లా స్వైర విహారం చేస్తున్నాయి. దోమలను అదుపు చేయాల్సిన విజయవాడ నగరపాలకసంస్థ చోద్యం చూస్తోంది. ఈ నేపథ్యంలో వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో వివిధ మాల్స్, కాంప్లెక్స్ వద్ద సెక్యూరిటీ ఉద్యోగాలు చేసే వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. దోమల దండు బెంబేలెత్తిస్తుండటంతో ఒక చోట కూర్చోలేక, నిలబడలేక అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో ఒక సెక్యూరిటీ గార్డు వినూత్నంగా ఆలోచించాడు. మంచానికి ఉండే దోమ తెరను తన కుర్చీ చుట్టూ పరుచుకున్నాడు. విజయవాడ బందరు రోడ్డులోని ఓ షోరూం వద్ద గురువారం తెల్లవారుజామున సాక్షి కెమెరా ఈ చిత్రాన్ని క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రేపు నూతన న్యాయ చట్టాలకు వ్యతిరేకంగా ధర్నా

విజయవాడస్పోర్ట్స్: ఎన్డీఏ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నూతన నేర న్యాయ చట్టాలకు వ్యతిరేకంగా 24వ తేదీ శనివారం విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్(రాజా) తెలిపారు. ఈ ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను సీనియర్ న్యాయవాదులు సుంకర రాజేంద్ర ప్రసాద్, వి.గురునాథం, నరహరశెట్టి నరసింహారావు, సంపర శ్రీనివాసరావు, రమేష్, కె.వరప్రసాద్‌లతో కలిసి గురువారం బీబీఏ హాలులో ఆవిష్కరించారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ధర్నా కొనసాగుతుందన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్, బీబీఏ, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్‌తో పాటు ప్రజా సంఘాలు ఈ ధర్నాలో పాల్గొంటాయని వారు వెల్లడించారు.